# శ్రీమతీ శ్రీవారూ

ఇంద్రగంటి నరసింహామూర్తి





నెల మొదటి రోజు. జీతం జేబులో పెట్టుకుని యింటి వైపు బయలు దేరాడతను.

ఆకాశం మేఘావృతమైంది.

ఇంటిలో అడుగు పెట్టాడతను.

ఆమె—అతని శ్రీమతి ఎదురు వచ్చింది —

ఈదురు గాలి మొదలైంది.

జీతం గురించి అడిగిందామె —

పెనుగాలికి కిటికీ రెక్కలు కొట్టుకున్నాయి.

ఆశతో ఆమె కను రెప్పలు అల్లల్లాడాయి.

పట్టుచీర — కొత్త నగలు — ఆమె కోరికలు.

ఏవీ? తెచ్చారా? ప్రశ్నార్థ కంగా ఆమె చూపులు.

ఈ శారీ తేలేదా? నిరాశ నిండిన కళ్ళు.

సారీ వద్దు. శారీ కావాలి. నాబతుకింతేనా? నిట్టూర్పులు.

బయట మెరుపులు. అతని గుండెల్లో పిడుగులు.

పట్టు చీరలకే జీతం సరిపోతే మరి తిండి మాట? కడుపులు నిండద్దూ.

కోరికలకి అంతుండాలి. అతని జవాబులు.

ఎక్కడో ఉరిమింది. ఆమెనోరు విప్పింది. అష్టోత్తరం.

ఈమాత్రానికే పెళ్ళీ పెటాకులూనా?

భార్యని పనిమనిషిగా చూడ్డానికా పెళ్ళి?

తిండి పెట్ట లేని వాడికి తోడు కావాలిటా?

మరో బ్రతుకు మంట కలప డానికి కాకపోతే?

అతనూ నోరు విప్పాడు.

చినికి చినికి గాలివాన. బయట హోరున వర్షం.

ఆమెకనుల నుండి అశ్రుధారలు.

ఉరుములు పిడుగులు. భూమాత తడిసి పోయింది.

ఇక తట్టుకోలేనట్టు జాలిగా ఆకాశం వైపు చూసింది. ఆకాశం జాలి పడింది.

మేఘాలని వుప్పని వూదింది.

మేఘాలు చెల్లా చెదురైనాయి.

ఆమె కనులు వర్షించి వర్షించి అతని వైపు జాలిగా చూశాయి.

అతని నోరు మూగ పోయింది.

నేనుగాక మరెవ్వరు నీ కోరికలు తీర్చేది అనుకున్నాడు అతను.

వచ్చేనెల ఎలాగైనా పట్టుచీర కొని తీరుతా అన్నాడతను.

ఆమె దగ్గరగా జరిగాడు.

నువ్వు మాత్రం ఏంచేయగలవులే.

నీ ఆర్థిక స్థోమత తెలిసి కూడా కోరికలు

కోరడం నాదే తప్పు.

ఆవేశం కన్నీటితో చల్ల బడింది.

అతని దగ్గరగా జరిగిందామె.

ఒకరి దగ్గరగా ఒకరు.

ఒకరి ఒడిలో ఒకరు. ఒకరి కొకరు.

ఆ చలిగాలిలో చెలిగాలి నంచు కున్నాడతను.

చెలికానితో మనసు పంచుకుందామె.

మేఘాలు తొలిగాయి.

మబ్బుల చాటు చంద్రుడు చల్లగా పైకి వచ్చాడు.

నల్లని ఆమె కేశ పాశాలలో చిక్కిన తన మోహాన్ని బయటకు తీసాడతను.

ఏలలు గడుస్తున్నాయి.

కేలండర్లు దొర్లుతున్నాయి.

ప్రతీ నెలా పట్టు చీర కొనాలనే అతని పంతం.

ఆమె యిద్దరు బిడ్డల తల్లయింది. పిల్లలు పెరుగుతున్నారు.

ఖర్చులూ పెరుగుతున్నాయి.

ఆమె ఆశలూ పెరుగుతున్నాయి. కానీ తీరే మార్గం?

తిట్టుకుంటూ అంతలోనే సర్దుకుంటూ —

సణుగుకుంటూ — సరిపెట్టు కుంటూ ప్రక్కవారితో సరిపోల్చుకుంటూ — కోరికలు తీర్చుకుంటూనే

ఆశలు పెంచు కుంటూ — కష్టాలు ఓర్చు కుంటూ — కన్నీళ్లు ఆపుకుంటూ — లోన ఏడుస్తున్నా పైకి నవ్వుతున్నట్టు నటిస్తూ — పడుతూ లేస్తూ —

మధ్య తరగతి బండి నెట్టు కుంటూ వయసు మీదేసుకున్నా రిద్దరూ.

పెద్ద బాబు ఉద్యోగస్థుడయ్యాడు.

వాడికి పిల్ల నిస్తామని వస్తున్నారు.

ఏమంటావ్ అని అడిగాడతను ఓ శుభ ముహూర్తంలో.

ఇంకేం. ఒప్పుకోండి మరి.

అయితే అత్తగారి లాంఛనాలుగా కంచి పట్టు చీర కనీసం వెయ్యి రూపాయిలది అడిగి తీరాల్సిందే అందామె ఆశగా.

ఓ భేషుగ్గా అన్నాడతను మామూలుగా.

ఇంతలో యింటి ముందు రిక్షా ఆగింది.

పెద్దబ్బాయి. పక్కనే ఆ పిల్ల ఎవరూ?

వారి మెడలో దండలేమిటి? — అన్నీ అనుమానాలే.

# అమర్ ఖయామ్

మానవ జీవిత మ్మొక అమాయికమైన గులాబి; దీని నే
దానవహస్తమే క్షణము దాకి పుటుక్కున త్రుంపివైచునో
గానము — గాన, నీ యమరగాన సుధామధుపాత్ర మిమ్ము చం
ద్రానన! మందహాస మధురాధర మించుక సంచలింపగన్.

వలపుల బావిలో మునుకవైచెను జీవిత మాధురీ సుధా
కలశము; పైకి చేదుకొనగావలె చంచల కాలచక్రపుం
గిలకల మీదుగా; ప్రియసఖీ! క్షణమాత్రవిలంబమైన లో
పల మధు వింకునో! పడునో పాత్రము! సూత్రము చేయిజారునో!

## డాక్టర్ కరుణశ్రీ

డాక్టర్ కరుణశ్రీ "అమర్ ఖయామ్" పద్యకావ్యం నుంచి

శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి (కళ్యాణ భారతి, రవీంద్రనగర్, గుంటూరు - 6) గారికి కృతజ్ఞతలతో

వస్తూనే తల్లిదండ్రుల కాళ్లపై పడ్డాడతను.

వాళ్లు రిజిస్టర్డ్ మేరేజి చేసేసు కున్నారు.

ఆమె పాదాలపై చేతులుంచింది.

ఆమె కళ్లు మళ్ళీ వర్షించాయి, మరో సారి ఓడిపోయినట్లు.

నీకింక పట్టుచీర యోగం లేదే ముద్దూ అన్న దామె మనసు.

ఇంతలో అబ్బాయి లేచాడు. వెంటతెచ్చిన సూటుకేసు తెరిచాడు. ఆ అమ్మాయి చేతిలో చీర పాకెట్టు వుంచి అమ్మకియ్యి అన్నాడు.

కోడలి చేతి ద్వారా అందు కుందామె. కంచి పట్టు చీర నీలం రంగు — ఎర్ర జరీ అంచు.

అబ్బ! ఎంత బాగుందో.

తండ్రికీ పట్టు బట్టలు అతను అందించాడు.

మీరిద్దరూ యీ బట్టలు కట్టుకోండి. మా వివాహ సందర్భంలో మీకు మేం పెడుతున్నాం అన్నాడతను.

ఆమె ఒక్క క్షణం నిలుచుంది. అంతలో లోనికి వెళ్ళింది. కుంకుమ భరిణె తెచ్చింది. కోడలికి బొట్టు పెట్టింది. పట్టుచీరె కోడలి చేతి కందించింది.

ఈ వయస్సులో మీరు నాకు పెట్టడ మేమిట్రా. కోడలికి నే నిచ్చే బహుమతి యిదే.

వెళ్లి కట్టుకురామ్మా, నీ వల్ల చీరకి అంద మొస్తుందో, చీర నీకు అందం తెస్తుందో చూడాలి అంది ఆమె.

ఆమె కనుల వెంట మళ్ళా అశ్రుధారలు — వూహూ అవి ఆనంద బాష్పాలు.

**తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ**